క్లుప్తంగా

15న స్పోర్ట్స్ మీట్

బోయినపల్లి: నెహ్రూ యువకేంద్ర, మైభారత్ ఆధ్వర్యంలో ఈనెల 15న మండలకేంద్రంలో స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు ఎన్‌వైకే మాజీ వాలంటీర్ గంగిపల్లి స్వామికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పోర్ట్స్ మీట్‌లో వాలీబాల్, కబడ్డీ, పరుగుపందెం, షటిల్ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో విజేతలకు రూ. 4వేల విలువ గల క్రీడాసామగ్రి అందించనున్నారు. రెండోస్థానంలో ట్రోఫీ, మెడల్స్, సర్టిఫికెట్లు అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల యువజన సంఘాలు, స్వామికుమార్ 8121459893 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ఇల్లంతకుంట: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఇల్లంతకుంట ఎంపీడీవో శశికళ అన్నారు. బుధవారం మండలంలోని గాలిపెల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మండలస్థాయి సీఎం కప్ క్రీడాపోటీలకు హాజరయ్యారు. మహిళల కబడ్డీ విభాగంలో 8 జట్లు, పురుషుల కబడ్డీ విభాగంలో 16 జట్లు పాల్గొన్నట్లు ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ సంపత్‌రావు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు సానబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. పావని, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హరీశ్

ఎల్లారెడ్డిపేట: సైబర్ నేరాలపై విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఫైనాన్స్ లిటరేచర్ కౌన్సిలర్ టీ. హరీశ్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అపరిచిత వ్యక్తులకు బ్యాంక్ అకౌంట్ వివరాలు, ఓటీపీ చెప్పవద్దన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వాసరవేని పర్శరాములు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

వేములవాడఅర్బన్: వేములవాడ ప్రెస్‌క్లబ్ టీయూడబ్ల్యూజే, ఐజేయూ ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు జర్నలిస్టులు ర్యాలీగా వెళ్లి వేములవాడ తహసీల్దార్ మహేశ్ కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పుట్టపాక లక్ష్మణ్ మాట్లాడుతూ సినీనటుడు మోహన్‌బాబు కుటుంబ తగాదాల వల్ల మీడియా కవరేజ్‌కు వెళ్లిన పాత్రికేయులపై దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. మోహన్‌బాబుపై అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి ప్రశాంత్, ప్రధానకార్యదర్శి నూగురి మహేశ్, సంయుక్త కార్యదర్శి దూలం సంపత్, తిరుపతి బాబు, పర్శరాములు, రవి, మన్నాన్, సాయిబాబా తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ప్రథమ చికిత్స ఏది?



రుద్రంగి: మండల కేంద్రంలో జరుగుతున్న క్రీడాపోటీల్లో మంగళవారం కబడ్డీ ఆడుతుండగా ఓ విద్యార్థి తీవ్ర అస్వస్థతకు గురై కిందపడిపోయాడు. హుటాహుటిన విద్యార్థిని అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు. బుధవారం పలువురు విద్యార్థులకు గాయాలైనా వైద్యసిబ్బందిని ఏర్పాటు చేయకపోవడం అధికారులు నిర్లక్ష్యానికి నిదర్శమని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ఓ విద్యార్థి అస్వస్థతకు గురైనా తర్వాత రోజు వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయకపోవడం ఏంటని వారు వాపోతున్నారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ఇంత నిర్లక్ష్యం సరికాదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయపై రుద్రంగి ఎంపీడీవో నట్రాజ్‌ను వివరణ కోరగా వైద్యసిబ్బందిని ఏర్పాటుచేయలేదని, తామే విద్యార్థులకు ప్రథమ చికిత్స అందించినట్లు తెలిపారు.

బహుమతులు ప్రదానం

రెండ్రోజులుగా జరుగుతున్న సీఎం కప్ క్రీడాపోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బుధవారం అధికారులు, ప్రజాప్రతినిధులు బహుమతులు ప్రదానం చేశారు. అందజేశారు. రుద్రంగి ఏఎంసీ చైర్మన్ చెలుకల తిరుపతి, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, అధికారులు, క్రీడాకారులు, తదితరులున్నారు.

ప్రారంభించారు.. వదిలేశారు !



చందుర్తి: మండలంలోని మర్రిగడ్డలో రూ.14లక్షల వ్యయంతో నిర్మించిన పల్లె దవాఖానను గత ఫిబ్రవరి 1న ప్రారంభించారు. ఇప్పటివరకు మళ్లీ దవాఖాన తెరుచుకోలేదు. భవన నిర్మాణం పూర్తయినా విద్యుత్ సౌకర్యం లేదన్న సాకుతో ఇప్పటికీ గ్రామంలోని అద్దె భవనంలోనే పల్లె దవాఖానను కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సౌకర్యం కల్పించి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా



వేములవాడ ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

వేములవాడఅర్బన్: పట్టణంలోని మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మీసం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. వేములవాడ ఆర్డీవో కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన రూ.10 వేలు వేతనం చెల్లించి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు లక్ష్మి, పోచవ్వ, భాగ్య, అంజవ్వ, విజయ, జ్యోతి, కోమురవ్వ తదితరులున్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



అంబేద్కర్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న మహిళలు

వీర్నపల్లి: మండలకేంద్రంలోని అంబేద్కర్ నగర్ కాలనీలో తాగునీరు రాక ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు బుధవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ మహిళలు మాట్లాడుతూ.. గత నెలరోజుల నుంచి మంచినీరు సరిగా రాకపోవడంతో వ్యవసాయ బావుల వద్ద తెచ్చుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

మాదిగ విద్యార్థుల సదస్సును జయప్రదం చేయండి



వేములవాడఅర్బన్: కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఈ నెల 19న జరిగే ఉమ్మడి జిల్లా మాదిగ విద్యార్థుల సదస్సును జయప్రదం చేయాలని ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సందె కార్తీక్ కోరారు. వేములవాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ ఏ, బీ, సీ, డీ వర్గీకరణను తెలంగాణలో అమలు చేయకుండా ఉద్యోగాల భర్తీకి పూనుకున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ తీరుపై సమరానికి సిద్ధం కావాలని కోరారు. లక్ష్మణ్, ఆవునూరి ప్రభాకర్, రాజు, రాకేశ్, ఆనంద్, కళ్యాణ్, రాజు ఉన్నారు.

గీతా జయంతి ఉత్సవాలు

వేములవాడఅర్బన్: పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో బుధవారం గీతా జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీ నిర్వహించారు. పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ప్రధానోపాధ్యాయుడు గట్టు, విద్యార్థులు తదితరులున్నారు.

ఆలయానికి రూ.10వేలు విరాళం

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీకేశవ పెరమాండ్ల ఆలయ రేయిలింగ్ కోసం ఎల్లారెడ్డిపేటకు చెందిన రాగుల మల్లారెడ్డి రూ.10వేలు అందించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతకు కృతజ్ఞతలు తెలిపారు. మరింత మంది దాతలు ముందుకొచ్చి ఆలయ అభివృద్ధి సహకరించాలని కోరారు.

కమిటీ ఎన్నిక



కోనరావుపేట: మండలంలోని మల్కపేట గ్రామ యాదవ సంఘం అధ్యక్షుడిగా ఎక్కల్‌దేవి రాములు ఎన్నికయ్యారు. బుధవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఎక్కల్‌దేవి పుట్టయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎక్కల్‌దేవి శ్రీనివాస్, కోశాధికారిగా సింగిటి బీరయ్య, సలహాదారులు పర్శరాములు, ఎక్కల్‌దేవి పెద్దిరాజు, కట్ల దేవయ్య, గెంటె కొమురయ్య ఎన్నికయ్యారు.

నేడు సమావేశం

వీర్నపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం ఎన్నికల పోలింగ్ కేంద్రాలపై రాజకీయ పార్టీ నాయకులతో గురువారం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ వాజిద్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పలు పార్టీల నాయకులు సకాలంలో హాజరుకావాలని కోరారు.



పొంచి ఉన్న ప్రమాదం..

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని బస్టాండ్ వద్ద రోడ్డుపై మ్యాన్‌హోల్‌పై పైకప్పు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. వాహనదారులు దగ్గరకు వచ్చేంతవరకు ఏర్పడక పోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు రోడ్డుపై ఉన్న మ్యాన్‌హోల్‌పై పైకప్పు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రెండు రోజులు తాగునీటి సరఫరా నిలిపివేత

సిరిసిల్లటౌన్: పైపులైన్ల మరమ్మతులో భాగంగా పట్టణంలో రెండు రోజులు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ దుబ్బాక లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల పట్టణానికి మంచినీటి సరఫరా చేసే రగుడు ఫిల్టర్ బెడ్ వద్ద మిషన్ భగీరథ పైపు లైన్ లీకేజీ ఏర్పడటంతో మరమ్మతులు చేయిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 12, 13న రెండ్రోజులు పట్టణంలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

హద్దులు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న యువకులు

చందుర్తి: మండలంలోని బండపల్లి గ్రామానికి చెందిన పోచమ్మ ఆలయానికి సంబంధించిన స్థలాన్ని సర్వేలు చేపట్టి హద్దులు చేపట్టాలని బండపల్లి గ్రామానికి చెందిన ఎండీ సమీయొద్దీన్, అంబాల శ్రీకాంత్, గంప పవన్, తీపీరెడ్డి లక్ష్మారెడ్డి చందుర్తి తహసీల్దార్ శ్రీనివాస్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆలయ భూమి అన్యాకాంత్రం కాకుండా సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేయాలని గ్రామ యువకులు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



బావుసాయిపేటలో చెక్కు అందిస్తున్న నాయకులు

కోనరావుపేట: మండలంలోని రామన్నపల్లె (బావుసాయిపేట) గ్రామానికి చెందిన గుంటి మమతకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ. 28,500 చెక్కును కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా అందజేశారు. కార్యక్రమంలో ఎక్కల్‌దేవి శ్రీనివాస్, బైరగోని నందూగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, దయాకర్, పర్శరాములు, దేవయ్య, సురేంద్రబాబు, సత్తయ్యరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

గంభీరావుపేట: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన షేక్ ముస్తాక్ గత రెండ్రోజులక్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబానికి రూ.50,900 వేలను బుధవారం మైనారిటీ అధ్యక్షుడు మొహమ్మద్ అదిల్, గ్రామస్తుల చేతులమీదుగా ఆర్థికసాయం అందజేశారు.



ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో ఐకేపీ కార్యాలయం కోసం 15 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉంది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.12లక్షలతో నిర్మించిన భవనాన్ని అధికారులు లక్షణంగా వదిలేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. గతంలో నేరేళ్ల ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య రెండో విడుత మిగిలిపోయిన పనుల కోసం నిధులు మంజూరు చేయించారు. దీంతో భవన నిర్మాణం పూర్తి చేసినప్పటికీ దానిని ఏ ప్రభుత్వ కార్యాలయానికి ఉపయోగించడం లేదు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
సత్తయ్య, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట: సెల్ నంబర్: 9989773073

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

ఆరుతడి పంటలు సాగుచేయాలి



అవగాహన కల్పిస్తున్న మదన్‌మోహన్ రెడ్డి

ఇల్లంతకుంట: యాసంగిలో వరికి బదులు ఆరుతడి పంటలు సాగు చేయాలని కరీంనగర్ జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్, వ్యవసాయ శాస్త్రవేత్త కే మదన్మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పొత్తూరు గ్రామ పంచాయతీ ఆవరణలో ఆయన ఆరుతడి పంటలపై అవగాహన కల్పించారు. వరి కొయ్యలను కాల్చొద్దని రైతులకు సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త రాజేంద్రప్రసాద్, పొత్తూరు వ్యవసాయ విస్తరణ అధికారి లలిత, రైతులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

చందుర్తి: మండలకేంద్రంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ ఆవరణలో మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం గ్రామస్తులు భూమిపూజ చేశారు. ఆలయ నిర్మాణానికి ప్రముఖ ఎన్నారై మోతె రాములు రూ.10.16లక్షలను విరాళాలు అందజేసేందుకు ముందుకొచ్చారు. మేడలమ్మ, కేతమ్మ, విగ్రహాలు అయ్యప్ప సేవా స్వామి సభ్యులు, శివ లింగం , నంది విగ్రహాలను వ్యాపార వేత్త కుమ్మరి మల్లయ్య, గణపతి విగ్రహానికి మాజీ సర్పంచ్ సిరికొండ ప్రేమలత శ్రీనివాస్ అందజేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గొట్టే ప్రభాకర్, నాయకులు మార్త సత్తయ్య, బత్తుల కమలాకర్, మోతె రాములు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

వేములవాడరూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయులకు బదిలీలు సహజమని ఎంఈవో లోకిని కిషన్ అన్నారు. వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను గ్రామస్తులు, అధ్యాపక బృందం తల్లిదండ్రులు సన్మానించారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు ఎస్.మమత, సీహెచ్.రామచంద్రం, శ్రీనివాస్, ఓ.రమేశ్‌ను ఘనంగా సన్మానించారు. పదేళ్లకు పైగా పనిచేసిన సందర్భంగా వారి జ్ఞాపకార్థంగా పాఠశాలకు స్మార్ట్ టీవీ బహూకరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీకాంతరావు, మాజీ సర్పంచ్ కటకం మల్లేశం, మాజీ ఎస్ఎంసీ చైర్మన్లు ఎల్లాగౌడ్, గంగ, పాఠశాల హెచ్‌ఎం పి.సుభాశ్‌రెడ్డి, వందన, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

అంగన్‌వాడీ టీచర్‌పై కేసు

ఎల్లారెడ్డిపేట: రాచర్లబొప్పాపూర్‌కు చెందిన అంగన్‌వాడీ టీచర్ నీరటి భవాని, ఆమె భర్త భూమరాజంపై కోర్టు అనుమతితో ఎల్లారెడ్డిపేట పోలీసులు కేసు నమోదు చేశా రు. గత నవంబర్ 4న పిల్లలకు కోడిగుడ్లు పెట్టలేదని గ్రామానికి చెందిన బెస్త నరేశ్ సీడీపీవోకు ఫిర్యాదు చేయగా.. మెమో జారీ చేస్తామని తెలిపారు. నీరటి భవాని ఫోన్‌లో బెస్త నరేశ్‌ను బెదిరింపులకు పాలపడడంతో ఎల్లారెడ్డిపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కోర్టు అనుమతితో అంగన్‌వాడీ దంపతులపై కేసు నమోదు చేశారు.

బహుమతులు ప్రదానం



మాట్లాడుతున్న ఎంఈవో రఘుపతి

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని మండల వనరుల కేంద్రం సుందరయ్యనగర్‌లో భవిత సెంటర్‌లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించారు. బుధవారం విజేతలకు బహుమతులు ప్రదానంచేశారు. సిరిసిల్ల మండల విద్యాధికారి దూస రఘుపతి మాట్లాడుతూ, దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు, ప్రోత్సాహకాలు వినియోగించుకోవాలని కోరారు. జిల్లా ఐఈ కో-ఆర్డినేటర్ పాశికంటి సతీశ్, జిల్లా సైన్స్ అధికారి దేవయ్య, ఐఈఆర్‌పీ సునీత, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ మండల నాయకులు బుధవారం క్షీరాభిషేకం చేశారు. మేడ్చల్ జిల్లా కీసర మండలంలో అంబేద్కర్ విగ్రహాన్ని అవమానపరిచిన దుండగుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు తడకపెల్లి భూమయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంద రాజు, వెంకటి , మల్లయ్య, రాజు, శీను, లింగం, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు బీఆర్‌ఎస్ నేత

సిరిసిల్ల క్రైం: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్దాపూర్‌లోని ప్రభుత్వ భూమిలో క్రషర్ నిర్వహిస్తున్నట్లు నమోదైన కేసు విషయంలో బీఆర్ఎస్ నేత రామ్మోహన్‌పై సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఇదే కేసుకు సంబంధించి పలు విషయాలను తెలుసుకునేందుకు బుధవారం సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌కు పోలీసు అధికారులు పిలిచినట్లు విశ్వసనీయంగా తెలిసింది. కేసుకు సంబంధించి పలు అంశాలను న్యాయవాది సమక్షంలో సేకరించినట్లు సమాచారం. ఇదే విషయమై సీఐ మొగిలిని వివరణ కోరగా కేసు దర్యాప్తు జరుగుతున్న క్రమంలో వివరాల కోసం న్యాయవాది సమక్షంలో హాజరైనట్లు చెప్పారు.

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

ఇల్లంతకుంట: మండలంలో సీఎం కప్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దుస్తులు అందించినట్లు మండల వ్యవసాయ కమిటీ వైస్‌చైర్మన్ ఎలగందల ప్రసాద్ అన్నారు. గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నేరెళ్ల విజయ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, నాయకులు నాయిని రమేశ్, అనిల్ కుమార్, రాజశేఖర్, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు

- కొన్ని గ్రామాల్లో నిర్మించినా అసంపూర్తిగానే
- నిధులు లేక నిలిచిన నిర్మాణాలు
- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు



ఇల్లంతకుంట ఎస్సీ కాలనీలో అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని కందికట్కూర్, పెద్ద లింగాపూర్ ఇల్లంతకుంట, అంగన్‌వాడీ సెక్టార్లు ఉన్నాయి. మండల పరిధిలో 64 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. మూడేళ్లనుంచి ఆరేళ్లలోపు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే పిల్లల సంఖ్య 976 మంది ఉన్నారు. ఇల్లంతకుంట సెక్టార్‌లో 22 అంగన్‌వాడీ కేంద్రాలుండగా 11 కేంద్రాలకు పక్కా భవనాలు ఉన్నాయి. 6 కేంద్రాలు ప్రాథమిక పాఠశాలలలో అనుసంధానంగా పనిచేస్తున్నాయి. ఇల్లంతకుంటలో రెండు, వల్లంపట్లలో రెండు, వెంకట్రావుపల్లిలో ఒకటి అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. పెద్ద లింగాపూర్ సెక్టార్‌లో 20 అంగన్‌వాడీ కేంద్రాలుండగా అనంతగిరి, అనంతారం, వెల్జిపూర్, అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. కందికట్కూర్ సెక్టార్ పరిధిలో 22 కేంద్రాలుండగా పొత్తూరులో రెండు కేంద్రాలు, కందికట్కూరులో ఒక కేంద్రం అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. ముస్కానిపేట, ఇల్లంతకుంట, రేపాక, వంతడుపుల, గాలిపెల్లి గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరుకాగా స్లాబ్ వరకు నిర్మించి వదిలేశారు.

భవనాలు పూర్తి చేయాలి



మండలంలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు పూర్తిచేయాలి. అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతుండటంతో చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే ప్రభుత్వం నిధులు మంజూరుచేసి నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలి.

– దేశెట్టి శ్రీనివాస్, బీజేపీ నాయకుడు, వెల్జిపూర్

నిధులు మంజూరుచేయాలి



ఇల్లంతకుంటలోని ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్ర భవనం ప్రభుత్వ భూమిలో 2014 లో నిర్మాణ పనులు చేపట్టారు. భవనానికి రూ. 2లక్షల70వేలు మంజూరయ్యాయి. మిగతా నిధులు మంజూరు కాక పనులు ఆగిపోయాయి. నిధులు మంజూరు చేస్తే నిర్మాణం పూర్తవుతుంది.

– మామిడిసంజీవ్, మాజీసర్పంచ్, ఇల్లంతకుంట